# తరంగాలు

మనిషిలేని చోట మాధవుడును లేడు
కన్నులేనిచోట కాంతి లేదు
తలచు దిక్కులేని స్థలము లేదిక చెలీ!
నేను లేని చోట నీవు లేవు!

—కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

వాస్కోలో జరిగే కారనివాల్ మొదటిరాత్రి డబోలీ విమానాశ్రయం దగ్గరలోనున్న బొగ్మలో బీచ్‌లో ఫిబ్రవరి పదహారు రాత్రి కొబ్బరితోటలో డాన్సుతో మొదలైంది. బాగా రంగుల మలారంతో అలంకరించబడిన యీ ప్రదేశంలో ఒక ప్రక్క బేండు వాగుతోంది. ఇంకో ప్రక్క పుష్కలంగా తాగడానికి స్పెషల్ బార్. కింగ్ మొమో బ్యాండు వాగుతుండగా పరివారంతో ప్రవేశించాడు. తన సింహాసనంనించే హుకుం జారీ చేశాడు. "నా పాలన మూడు రోజులే! ఈ మూడు రోజులూ నా ప్రజలు చింతను పారద్రోలి హాయిగా కేర్‌ఫ్రీగా తమాషాగా బ్రతకండి. కేళిక్రీడల్లో మునిగి తేలండి. మొదలెట్టండి—డాన్సు...." అనగానే బ్యాండు డాన్సు ట్యూన్‌లో పడితే ఆపి— "ఒక్క నిబంధన. లేడీస్ ముడుకులు దాటని స్కర్టుల్లోనే రావాలి. వాళ్ళు ఒక కళాఖండంలా కనబడ్డానికి వున్న అందమైన వంపులను దాచుకోకూడదు. గో ఆన్— డాన్స్— డాన్స్...."

కింగ్ మొమోగారు కాస్సేపు తిలకించి యింకా వీళ్ళు నిత్య జీవితం మరచిపోలేదనీ "ఎంజాయ్-ఎంజాయ్-గో-గే-గోగే...." అని అరుస్తున్నాడు. అతని అరుపులు అక్కడే వున్న ఓబ్రాయ్ ఫయివు స్టార్ హోటల్ పై అంతస్థుకు విని పిస్తున్నాయ్. తెల్లవారేవరకు డాన్సు సాగింది. మధ్యలో విచిత్ర వేషధారణ. ఐదుగురు జడ్జీలు బహుమతులు నిర్ణయించారు. అక్కడకు రవి ఒక్కడే వచ్చాడు. వెంట లుయీజా లేదు.

మరుసటి రోజు ఉదయం తొమ్మిదికి ఒక్కో బోటు నలుగురు చొప్పున చైనా బీచిలో బోట్ రేస్. వెలుగుతున్న యెండలో పడవలు పరుగెత్తాయి. బీచి నిండిన ప్రజ అరుపులే పడవలను పరుగెత్తించాయి. ఆ వేళ సాయంత్రం అన్ని స్కూళ్ళ నుంచి పిల్లల విచిత్ర వేషధారణ. ఈ వేషాల్లో పాల్గొన్న డిసౌజా రెండో కూతురికి బహుమతి వచ్చింది.

ఆ మరుసటి రోజు సాయంత్రం వాస్కో ఫుట్‌బాల్ క్లబ్ ప్రక్కనున్న స్టేడియంలో ఫుట్‌బాల్ మేచ్. రూపాయి టికెట్. ఆఫీసుకు వెళ్ళకండా రవి యిందులో దూరాడు. ఆడ టీమ్‌లో లుయీజా వుంది. మగ టీమ్‌లో మంత్రులు దగ్గర నుంచి యిదివరకు ఖ్యాతి పొందిన ఆటగాళ్ళు వున్నారు. ఒక గోల్ కీపర్ హాస్యగాడైతే యింకో గోల్ కీపర్‌కి కళ్ళు కనిపించవట! మొదట అరగంట చాలా సీరియస్‌గానే ఆడారు. అప్పుడే లుయీజా గోల్ చేసింది. రెండో అరగంటలో అంతా తమాషాయే. ఇదివరకటి

## అనామకుడి డైరీ

### ఇడ్లీ

తెనాలిలో మా క్లాసులోనే ఒక బ్రాహ్మల కుర్రాడుండేవాడు. తండ్రి పోవడంతో మేనమామ దగ్గిరే తల్లీ, కొడుకూ వుండేవారు. మేనమామది కూడా చాలా బీద సంసారం.

ఇడ్లీ, శెనగ పచ్చడి చేసి, అమ్మి, కాలం గడుపుతూవుండేవాళ్ళు. ఆ రోజుల్లో కానీకి ఒక ఇడ్లీ, పచ్చడి ఫ్రీ.

మా స్నేహితుడి దగ్గర రోజూ కానీ యిచ్చి, యిడ్లీ కొనుక్కుని పచ్చడితో ఆప్యాయంగా తిని, వాడి కుటుంబపోషణ భారాన్ని కొంత మోసేవాళ్ళం.

పాకెట్ మనీ విషయంలో మా నాన్నగారు చాలా ఉదారంగా వుండడం వల్ల, డబ్బు విషయంలో అట్టే యిబ్బంది వుండేది కాదు.

ఒకసారి మా యిడ్లీ స్నేహితుడికి అర్జంటుగా రూపాయి అప్పు కావాల్సి వచ్చింది. మా వాడికి అడపా తడపా రూపాయలు దొరుకుతున్న విషయం మేం అనుకోగా తెలిసి, వాడు మమ్మల్ని అప్పు అడిగాడు.

ఇడ్లీలు పూర్తిగా అమ్మేసి, మా అప్పు తీర్చేస్తానని వాడు మాట ఇచ్చాడు. అయితే వాడు ఏనాడూ ఇడ్లీలు పూర్తిగా అమ్మిందీ లేదు. మా అప్పు తీర్చిందీ లేదు.

"ఏదిరా మా రూపాయి?" అని నిలదీసి అడిగితే, తప్పించుకుని తిరగడం ప్రారంభించాడు.

దాంతో మేం రోజూ తినే ఇడ్లీ కూడా దొరక్కపోవడం వల్ల మాకు చాలా కోపం వచ్చింది.

చివరికి స్కూల్ కాంపౌండులో మా గ్యాంగ్ చేతిలో వాడు చిక్కాడు. మేం ఇంకా తన్నకుండానే చాలా గోల చేసేశాడు. మేమేదో వాడ్ని హత్య చెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నామంత రాద్ధాంతం చేసేశాడు.

"మా క్లాస్ టీచరుగారు (ఆ రోజుల్లో మగ మేష్టర్లుకూడా టీచర్లే) వచ్చి, నేను క్లాసులో అన్నింటిలో ఫస్టు కావడంచేత నన్ను కావాలని ఆయనే తన సెక్షన్‌లో వేయించుకోవడంచేత, కాస్త కనికరంగా బెత్తంతో కొట్టకుండా తిట్టి వదిలేశారు.

"పాపం బీద పిల్లాడిని పట్టుకుని వెధవ రూపాయి కోసం తన్నాన్రా వెధవల్లారా! (ఆ రోజుల్లో రూపాయేం వెధవది కాదు! ఈరోజు యిరవయిరూపాయిలకి సమానం) అసలు తీర్చలేని వాడికి అప్పివ్వటం మీదే బుద్ధి తక్కువ. వాడి దగ్గర యిడ్లీలు తిని, మళ్ళీ డబ్బు అడుగుతార్రా వెధవల్లారా! బీదవాళ్ళకి సాయం చేయడం పోయి, బాధ పెడతార్రా భడవా కానాల్లారా!" అని ఒకటే నీతి బోధలు!

ఆ రోజుకీ, యీ రోజుకీ, అప్పు ఇచ్చినవాళ్ళకీ, పుచ్చుకున్నవాళ్ళకీ మధ్య వున్న న్యాయం మారలేదు.

ఇప్పుడు బ్యాంకుల వాళ్ళు యిస్తున్న అప్పుల సంగతేమిటి మరి?

రూపాయి పోయినా ఒక జీవిత సత్యం తెలిసింది.

దున్నేవాడిదే భూమి: తీసుకున్నవాడిదే అప్పు డబ్బు!

జై భారత్!!

— వేమరాజు నరసింహారావు